# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-08-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో మూడు దశాబ్దాల కల సాకారమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

❖ పారిశ్రామికవేత్తలందరూ తమ సంస్థల ప్రాంగణంలో పచ్చదనాన్ని అభివృద్ధి చేసి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సూచించారు.

❖ విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారిస్తోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

❖ పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో ముఖ్యమంత్రి రేపు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

====================

మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల నేటితో సాకారమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఆయన ఈరోజు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం దోర్నాల వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ... శ్రీశైలం ప్రాజెక్టులోని కొల్లం వాగు నుంచి నీటిని గ్రావిటీ ద్వారా తెస్తున్నామని చెప్పారు. 10 వేల 200 కోట్ల రూపాయల ప్రాజెక్టు వ్యయంలో 7 వేల 983 కోట్ల రూపాయలతో మొదటి దశ పూర్తిచేశామని 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి చేశామన్నారు. 48 రోజుల్లోనే 6 వేల 206 నిర్వాసిత కుటుంబాలకు 768 కోట్ల రూపాయల పరిహారం అందించామన్నారు. నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగు నీటిని అందిస్తామని స్పష్టం చేశారు. మార్కాపురం ప్రాంతం పొరుగు జిల్లాలకు పోటీగా నిలుస్తుందని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశను ఇదే వేగంతో 2028 నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలందరూ దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన భవిష్యత్‌ను అందించడం మనందరి బాధ్యత అని పేర్కొంటూ... పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని ఉపముఖ్యమంత్రి సూచించారు.

====================

విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టిసారిస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విశాఖపట్టణం జిల్లా ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ (AIG) హాస్పిటల్స్ కు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ... సమాజంలో మనం ఆశించే మార్పు రావడానికి విద్య, వైద్య రంగాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని, ఇందుకు అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వపరంగా ఏఐజీ హాస్పిటల్స్ కు అన్ని విధాల సహకారం అందిస్తామన్నారు. విశాఖకు వచ్చినందుకు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాం.. విశాఖ భవిష్యత్ నగరమని ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్ గా దీనిని తీర్చిదిద్దుతామని చెప్పారు. విశాఖలో 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడి, వెయ్యి పడకల సామర్థ్యంతో ఆరోగ్య సంరక్షణ, శిక్షణ, పరిశోధనతో పూర్తి స్థాయి హెల్త్ కేర్ ఎకోసిస్టమ్ ను నిర్మిస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు.

====================

ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి అధికారులను ఆదేశించారు. ఇంకా నిర్మాణం ప్రారంభం కాని ఇళ్లను తక్షణమే ప్రారంభమయ్యేలా చేయాలన్నారు. జిల్లాలోని PM-JANMAN గృహ నిర్మాణాల పురోగతిపై ఆమె ఈరోజు సమీక్ష నిర్వహించారు. జిల్లాలో PM-JANMAN కింద 28 వేల 691 ఇళ్లు మంజూరయ్యాయని, వీటిలో 25 వేల 388 ఇళ్లు గ్రౌండింగ్ కాగా, 3 వేల 303 ఇళ్లు ఇంకా నిర్మాణం ప్రారంభం కాని దశలో ఉన్నాయని అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ నేపథ్యంలో నిర్మాణం ప్రారంభం కాని 3 వేల 303 ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి లబ్ధిదారున్ని క్షేత్రస్థాయిలో వ్యక్తిగతంగా సంప్రదించి, నిర్మాణం ప్రారంభించేందుకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

====================

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గంలో రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలో 2 లక్షల 19 వేల 625 మంది లబ్ధిదారులకు 95 కోట్ల 21 లక్షల రూపాయల పింఛన్లు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్టు ఆమె వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి నరసాపురం నియోజకవర్గంలో అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి.. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

====================

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ SIR ప్రక్రియకు సంబంధించి షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించిందని, 2026 జూలై ఒకటిని అర్హత తేదీగా నిర్ణయించిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి తెలిపారు.

=====================

=====================